క్లుప్తంగా

గంగాలమ్మ తల్లి మాలధారణ



గంగాలమ్మ తల్లిని దర్శించుకుంటున్న మాలధారులు

మునగపాక: మండలంలోని మూలపేటలో ఆదివారం భక్తులు గంగాలమ్మ తల్లి మాలలు ధరించారు. ఈ నెల 19వ తేదీన జరగనున్న ఆలయ ప్రథమ వార్షికోత్సవంలో భాగంగా మాలధారణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాలధారులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు.

మోదకొండమ్మ ఆలయానికి విరాళం



ఆలయానికి సిమెంట్ విరాళంగా అందజేస్తున్న ఉమేష్

మునగపాక: స్థానిక బైపాస్ రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న మోదకొండమ్మ ఆలయానికి పలువురు భక్తులు తమవంతు విరాళాలు అందజేస్తున్నారు. ఆదివారం మునగపాకకు చెందిన కాంట్రాక్టర్ పెంటకోట ఉమేష్ తనవంతు సాయంగా 50 సిమెంట్ బస్తాలను విరాళంగా ప్రకటించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాఘవేంద్ర స్వామికి ప్రత్యేక పూజలు




పూలతో అలంకరించిన రాఘవేంద్ర స్వామి

అనకాపల్లి టౌన్: పట్టణంలోని వేల్పులవీధి రాఘవేంద్ర గురు సార్వభౌమ 354వ ఆరాధన మహోత్సవాల్లో భాగంగా రాఘవేంద్ర స్వామికి ఆదివారం పూజలు నిర్వహించారు. సాయంత్రం రాఘవేంద్ర స్వామి బృందావన సమితి ఆధ్వర్యంలో వేదపారాయణం, అన్నమాచార్య అమృతవర్షిణి కోలాట బృందం వారి కోలాటం ప్రదర్శన కార్యక్రమాలు జరిగాయి. రాత్రి ఎనిమిది గంటలకు పల్లకీ సేవ, స్వస్తివాచనం, మహా మంగళ హారతి నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు.

ఆలయ భూముల కౌలు వేలం రేపు

ఎస్.రాయవరం: కొరుప్రోలు సీతారామస్వామి దేవస్థానం భూములు కౌలుకు సాగు చేసుకునేందుకు వేలం నిర్వహిస్తున్నట్టు గ్రామ రెవెన్యూ అధికారి శ్రీధర్ తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటలకు దేవదాయ శాఖ అధికారులు ఆధ్వర్యంలో స్థానిక రామాలయం వద్ద వేలం పాట నిర్వహిస్తామన్నారు. కొరుప్రోలులో సర్వే నెంబర్ 101–4లో 4.86 ఎకరాలకు గాను రూ. 5 వేలు ధరావత్తు చెల్లించాలన్నారు. గుర్రాజుపేటలో సర్వే నెంబర్ 136–2లో 0.33 ఎకరాలకు రూ. 20 వేలు, సర్వే నెంబర్ 133లో 4.46 ఎకరాలకు రూ.5 వేలు, సర్వే నెంబర్ 202–6లో 0.08 ఎకరాలు, 199–6 లో 0.06కి రూ.2 వేలు, ఇదే దేవస్థానానికి చెందిన నక్కపల్లి మండలం సీహెచ్ఎల్ పురంలో 72–1, 2లలో 7.48 ఎకరాలకు రూ. 20 వేలు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలన్నారు.

ఉత్సాహంగా వాకర్స్‌కు ఆటల పోటీలు



పరుగు పందెంలో తలపడుతున్న వాకర్స్

చోడవరం: స్థానిక వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వాకర్స్‌కు ఆదివారం ఆటల పోటీలు నిర్వహించారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏటా చోడవరం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్టు క్లబ్ అధ్యక్షుడు ఓరుగంటి రాంబాబు చెప్పారు. ఈ క్లబ్‌లో 45 80 ఏళ్ల వయస్సున్న వారంతా సభ్యులుగా ఉన్నారన్నారు. వీరంతా ఈ పోటీల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. రన్నింగ్, వాకింగ్, మ్యూజికల్ చైర్, టగ్ ఆఫ్ వార్, తదితర పోటీలు పాల్గొని సత్తా చాటారు. విజేతలకు స్వాతంత్ర్య దినోత్సవం రోజున బహుమతులు అందజేయనున్నారు.



జగన్నాథపురం సమీపంలో వర్షపునీరు దిగువకు అడ్డంగా వేసిన మట్టి

కాంట్రాక్టర్ల నిర్వాకం.. రైతులకు శాపం

- మట్టితో గెడ్డలు, కాలువలు మూసివేత
- పోలవరం కాలువలోనే వర్షపునీరు
- చెరువుల్లోకి చేరక ఇబ్బందులు
- 800 ఎకరాల్లో వరి సాగు ప్రశ్నార్థకం

నక్కపల్లి: పొలాల చెంతనే కాలువ ఉంది. భారీ వర్షాలు పడిన సమయంలో అందులో పుష్కలంగా నీరు చేరుతోంది. కాంట్రాక్టర్ల నిర్వాకం వల్ల ఈ నీటిని ఉపయోగించుకుని సాగు చేసుకునే భాగ్యం కలగలేదంటూ పోలవరం కాలువ దిగువ ప్రాంతాల అన్నదాతలు గగ్గోలు పెడుతున్నారు. కాలువ నీటి మాట అలా ఉంటే.. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షపునీరు సైతం దిగువ ప్రాంతాలకు రాకుండా అడ్డుకట్ట వేయడంతో 800 ఎకరాల్లో వరి సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఏటా ఖరీఫ్ సీజన్‌లో ఈ సమస్య గురించి పోరాడుతున్నామని, ఇరిగేషన్ అధికారులకు మాత్రం చీమకుట్టినట్లుగా లేదని ఆయకట్టు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సహనం కోల్పోయిన వీరంతా కాలువ పనులు చేస్తున్న పోలవరం కాంట్రాక్ట్ సిబ్బందికి సమస్య వివరించి తొందరలో పరిష్కరించకపోతే కాలువ పనులు అడ్డుకుంటామని హెచ్చరించారు.

2005లో మహానేత వైఎస్సార్ పుణ్యమా అని పోలవరం ప్రాజెక్టు పనులు ప్రారంభమయ్యాయి. పాయకరావుపేట నుంచి తాళ్లపాలెం వరకు 6, 7, 8 ప్యాకేజీల కింద పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులు చేపట్టారు. పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్. రాయవరం మండలాల్లో ప్రారంభించారు. అప్పట్లో టీడీపీ ఎంపీ నామా నాగేశ్వరరావుకు చెందిన మధుకాన్ సంస్థ కాంట్రాక్ట్ పనులు దక్కించుకుంది. కాంట్రాక్టరు నిర్వాకం పలు గ్రామాల్లో చెరువు ఆయకట్టు భూములకు శాపంగా మారింది. జగన్నాథపురం, రమణయ్యపేట, సీతంపాలెం, గుల్లిపాడు, సీతానగరం తదితర గ్రామాల్లో పలు చెరువులు ఉన్నాయి. ఎగువ ప్రాంతాల్లో పడిన వర్షపునీరు ఈ చెరువుల్లోకి చేరేందుకు గెడ్డలు, వాగులు, కాలువలు ఉన్నాయి. కాలువ తవ్వకాల్లో వచ్చిన మట్టితో నీటి మార్గాలను, గెడ్డలను కప్పివేయడంతో దిగువ ప్రాంతాల్లో చెరువుల్లోకి నీరు రాకుండా పోలవరం కాలువలోనే ఉండిపోతోందంటూ ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏడేళ్ల నుంచి ఈ సమస్య ఎదుర్కొంటున్నప్పటికీ నీటిపారుదల శాఖ అధికారులు పరిష్కారానికి చర్యలు చేపట్టడం లేదంటూ రైతులు ఆరోపిస్తున్నారు. ఈ సమస్యపై గతంలో ఆందోళన చేసి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తే, తాత్కాలికంగా పరిష్కరించారు. రెండేళ్లపాటు వర్షపునీరు యథావిధిగా చెరువుల్లోకి చేరింది. తర్వాత సమస్య మళ్లీ మొదటికొచ్చింది.

కూటమి పాలనలో మళ్లీ అదే తీరు..

కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కాలువ తవ్వకాల పనులు పునః ప్రారంభించారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టరు కూడా ఇలాగే వ్యవహరిస్తున్నారు. తవ్వగా వచ్చిన మట్టిని యథావిధిగా వేసేస్తున్నారు. దీంతో రైతులంతా వెళ్లి కాంట్రాక్ట్ సిబ్బందిని నిలదీశారు. ఆయకట్టు భూములకు నీరందించే కాలువలపై మట్టి వేయడం ఎంత వరకు సమంజమని నీటి సంఘం డైరెక్టర్ నారపురెడ్డి కుమారి ఆధ్వర్యంలో రైతులంతా అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ రెండు చెరువుల కింద 400 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ చెరువుల్లో నీరు ఆధారంగా వరిపంట సాగు చేస్తున్నారు. గుల్లిపాడు, రమణయ్యపేట గ్రామాల్లోనూ మరో 400 ఎకరాల పరిస్థితి కూడా ఇలాగే ఉంది.

మట్టి తీసి గట్టుపై వేయడంతో సమస్య

భారీ వర్షాలు పడిన సమయంలో కాలువ గట్టుపై వేసిన మట్టి కరిగి గెడ్డలు వాగుల్లో పడి నీటి మార్గాలు మూసుకు పోయాయి. అప్పటినుంచి అధికారులకు మొరపెట్టుకున్న ఎవరూ పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. గెడ్డలకు ఇరువైపులా బెర్మ్‌ల చివరి వరకు తవ్వేయడంతో గెడ్డలు, వాగులు కనుమరుగయ్యాయని వాపోతున్నారు. ప్రధానంగా పోలవరం కాలువను ఆనుకున్న జగన్నాథపురంలో నేరెళ్లమాని చెరువు, పెద్ద చెరువుల్లోకి వర్షపునీరు రాకుండా పోలవరం కాలువలోనే ఉండిపోతోందంటూ ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గత పాలనలో పునరుద్ధరణ చర్యలు..

ఏటా ఖరీఫ్ సీజన్‌లో చెరువుల్లో నీటిని నమ్ముకుని వరి పంట వేస్తున్నామని, వర్షాలు పడినప్పటికీ ఎగువ ప్రాంతాల నుంచి నీరు మాత్రం రావడం లేదని రైతులు వివరించారు. వరి సాగు చేసినా చెరువుల్లో నీరు లేక వర్షాలపైనే ఆధారపడాల్సి వస్తోంది. మూడేళ్ల క్రితం ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణల దృష్టికి ఈ విషయం తీసుకెళ్లడంతో ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి మార్గాలు పునరుద్ధరించేలా చర్యలు తీసుకున్నారు. ఈ ఏడాది మళ్లీ అదే సమస్య ఎదురైందని రైతులు వాపోతున్నారు. గెడ్డలు, వాగులపై పోలవరం కాంట్రాక్టర్లు వేసిన మట్టిని పూర్తిగా తొలగించి వెడల్పు చేసి పునరుద్ధరించాలని లేదా ప్రధాన కాలువకు పిల్ల కాలువలు ఏర్పాటు చేసి చెరువుల్లోకి నీరు యథావిధిగా నీరు చేరేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. జగన్నాథపురంలోనే కాకుండా రమణయ్యపేట, గుల్లిపాడు, చినదొడ్డిగల్లు, ఉద్దండపురం గ్రామాల్లో పలు చెరువులదీ ఇదే సమస్య ఉంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయ్యేలోపు ఈ సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

ఇరిగేషన్ అధికారులు త్వరగా పరిష్కరించాలి



మధుకాన్ కాంట్రాక్టర్ల నిర్వాకం వల్ల జగన్నాథపురంలో నేరేళ్లమాని చెరువు, పెద్ద చెరువుల్లోకి ఏడేళ్లనుంచి సరిగ్గా నీరు రావడం లేదు. కాలువ తవ్వకాల్లో వచ్చిన మట్టిని గెడ్డలు, వాగుల్లో వేసి కప్పేశారు. గతంలో ఎమ్మెల్యే బాబూరావు, వీసం రామకృష్ణల దృష్టికి తీసుకెళ్లి తాత్కాలికంగా పరిష్కరించుకున్నాం. వర్షం పడితే చెరువులో నీరు చేరితేనే ఆయకట్టు భూముల్లో వరి సాగు చేసే పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది అడపాదడపా పడిన వర్షాలకు గెడ్డల ద్వారా చుక్కనీరు రావడం లేదు. ఇరిగేషన్ అధికారుల స్పందించి ఈ సమస్య పూర్తిగా పరిష్కరించాలని కోరుతున్నాం. త్వరగా పరిష్కరించకపోతే కాలువ తవ్వకాలను అడ్డుకుంటాం.

–నారపురెడ్డి కుమారి, రైతు, జగన్నాథపురం



కాంట్రాక్ట్ సిబ్బందికి సమస్య వివరిస్తున్న రైతులు

అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు గుర్తింపు



గ్రంథపాలకుడు రమణను సత్కరిస్తున్న దృశ్యం

మునగపాక: అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు సమాజంలో తగిన గుర్తింపు ఉంటుందని విశ్రాంత ఉపాధ్యాయుడు పెంటకోట తులసీరావు పేర్కొన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో పని చేసి అచ్యుతాపురం బదిలీపై వెళ్లిన గ్రంథపాలకుడు ఎల్‌వీ రమణను ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధి నిర్వహణలో రమణ అంకితభావంతో పనిచేశారన్నారు. విద్యాభివృద్ధికి అందించిన సేవలు అమోఘమన్నారు. తిమ్మరాజుపేట గ్రంథాలయాధికారి దొడ్డి కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్థానిక గ్రంథాలయాధికారి వరలక్ష్మి, పెద్దలు ఆళ్ల మహేశ్వరరావు, ఎంవీ సత్యనారాయణ, టెక్కలి జగ్గారావు, ఉపాధ్యాయులు పిల్లా జగదీష్, దాడి రామప్పారావు, బీడీఎస్ సెంటర్ల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కోరుతూ ఆటో కార్మికుల నిరసన



ఉపాధి కోసం నిరసన తెలుపుతున్న ఆటో కార్మికులు

పరవాడ: ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. పరవాడలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం ఆటో కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ నిరుద్యోగులుగా ఉన్న అనేక మంది బ్యాంకులు, ఫైనాన్స్ కంపెనీల వద్ద అప్పులు చేసి ఆటోలు కొనుగోలు చేసి ప్రతి నెలా కిస్తీలు చెల్లించుకుంటూ కుటుంబాలను నెట్టుకొస్తున్నారన్నారు. ఈ విధంగా రాష్ట్రంలో సుమారు 10 లక్షల మంది ఉన్నారన్నారు. ఈ నెల 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తే ఆటో కార్మికుల ఉపాధికి విఘాతం కలుగుతుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి ఆటో కార్మికులు వ్యతిరేకం కాదన్నారు. అయితే ఎన్నికల్లో ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన ప్రతి ఆటో కార్మికుడికి వాహన మిత్ర పథకం కింద ఏడాదికి రూ. 25 వేలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలన్నారు. గ్యాస్‌పై విధించిన వ్యాట్ తగ్గించాలన్నారు. 2019లో తీసుకొచ్చిన జీవో 21ను రద్దు చేయాలని, పెంచిన అన్ని రకాల ఫీజులు, పెనాల్టీలు తగ్గించాలన్నారు. బ్యాంకుల ద్వారా ఆటోల కొనుగోలుకు వడ్డీ లేని రుణాలు మంజూరు చేయాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో పి.శ్రీనివాసరావు, రాము, అప్పలరాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వామికి యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణ పుష్పార్చన సేవ ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపం వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర పూజ నిర్వహించారు. ఉభయదాతలకు శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

వైభవంగా నిత్యకల్యాణం..

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30 నుంచి నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడా మండప వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ప్రజల్లోకి ప్రభుత్వ పథకాలు

మునగపాక: ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు బొండా జగన్ కోరారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం పార్టీ మండలాధ్యక్షుడు పెంటకోట విజయ్ అధ్యక్షతన క్లస్టర్, బూత్ ఇన్‌చార్జులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తుందన్నారు. సుపరిపాలన పేరుతో గ్రామాల్లో నిర్వహిస్తున్న కార్యక్రమానికి విశేష స్పందన వస్తుందన్నారు. పార్టీ బలోపేతంతోపాటు ప్రజా సమస్యలపై దృష్టి సారించి వాటి పరిష్కారానికి పాటుపడాలన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ, మాజీ ఎంపీపీ ఆడారి మంజు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ డొక్కా నాగభూషణం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత మృతికి సంతాపం



రమణ

నక్కపల్లి: వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, రేబాక సర్పంచ్ సాదిరెడ్డి శ్రీను తండ్రి రమణ(72) మృతికి పలువురు సంతాపం తెలిపారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న రమణ ఆదివారం రేబాకలో మృతి చెందాడు. రేబాక, తిరుపతి పాలెం, రేవళ్ల గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి రమణ ఎంతో కృషి చేశారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వీరాభిమానిగా జగన్‌మోహన్‌రెడ్డి స్థాపించిన వైఎస్సార్‌సీపీలో చేరి పార్టీ బలోపేతానికి కృషి చేశారు. రమణ మృతి పట్ల పాయకరావుపేట సమన్వయకర్త మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, ఎంపీటీసీ వెల్లంకి కాసుబాబు, వీహెచ్‌పీ మాజీ అధ్యక్షుడు గొట్టుముక్కల శ్రీహరిరాజు, పీఏసీఎస్ మాజీ చైర్మన్లు అయినంపూడి మణిరాజు, పొడగట్ల పాపారావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సంతాపం వ్యక్తం చేశారు.


నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఎస్.రాయవరం: మండలంలో ఎస్.రాయవరం, పెదగుమ్ములూరు విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. ఎస్.రాయవరం సబ్ స్టేషన్ పరిధిలో ఎస్.రాయవరం ఫీడర్‌కు సంబంధించి ఉప్పరాపల్లి, వెంకటాపురం, లింగరాజుపాలెం, జేవీపాలెం, సర్వసిద్ధి, కర్రివానిపాలెం, బసవపాడు, సైతారుపేట, వాకపాడు, పెదగుమ్ములూరు సబ్ స్టేషన్‌లో చినగుమ్ములూరు ఫీడర్‌కు సంబంధించి పెట్టుగొళ్లపల్లి, రామయ్యపట్నం, నీలాద్రిపురం, నక్కపల్లి మండలం పెదబోదిగల్లం, రామకృష్ణాపురం, పెదదొడ్డిగల్లు, సీతమ్మపాలెం గ్రామాలకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండబోదని చెప్పారు.

24న మట్టి గణపతి విగ్రహాల పంపిణీ

అనకాపల్లి: గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 24న ఉదయం 9 గంటలకు జీవీఎంసీ పెద్ద హైస్కూల్ వద్ద వినాయక చవితి పురస్కరించుకుని 3,500 మట్టి గణపతి ప్రతిమలు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణి భూషన్ శ్రీధర్ పేర్కొన్నారు.

వృద్ధుల కోసం సోషల్ సర్వీస్ గ్రూపు



గౌరీపతిని శాలువాతో సత్కరిస్తున్న సీనియర్ సిటిజన్స్

అనకాపల్లి: వృద్ధుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు సోషల్ సర్వీస్ గ్రూపును ఏర్పాటు చేసినట్టు విశ్రాంత డిప్యూటీ డీఈవో కె.వి.గౌరీపతి తెలిపారు. స్థానిక జార్జి క్లబ్ ఆవరణలో సోషల్ సర్వీస్ గ్రూపు ప్రథమ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. గ్రూపు సభ్యులు గౌరీపతిని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదిలో సభ్యులందరి సహకారంతో అనకాపల్లి మండలంలోనే కాకుండా ఇతర మండలాల్లో అనాథ శరణాలయాలు, వృద్ధాశ్రమాలు వంటి 9 సంస్థలకు అవసరమైన నిత్యావసర సరుకులు, ఇతర సామగ్రిని అందజేశామన్నారు. అనంతరం 80 సంవత్సరాలు పూర్తి చేసుకున్న విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులను సత్కరించారు. కార్యక్రమంలో గ్రూప్ సభ్యులు ఎం.బి.వి.స్వామి, వీరభద్రరావు, పావడ సత్యారావు, కాశీ విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ పాలకవర్గాల నియామకం



యల్లపు వెంకట భాస్కరరావు



విల్లూరి నూక నరసింగరావు



పెంటకోట నరసింగరావు

మునగపాక: మండలంలోని మూడు పీఏసీఎస్‌లకు పర్సన్ ఇన్‌చార్జులతోపాటు డైరెక్టర్లను నియమిస్తూ జీవో ఆదివారం విడుదలైంది. నాగులాపల్లి పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జిగా యల్లపు వెంకట భాస్కరరావు, డైరెక్టర్లుగా కొంతం సత్య పార్వతి జగదీశ్వరరావు, సుందరపు శ్రీనివాసరావు నియమితులయ్యారు. మునగపాక పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జిగా విల్లూరి నూక నరసింగరావు, డైరెక్టర్లుగా మొల్లి అప్పలరాజు, పాలివిని రామారావు, చూచుకొండ పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జిగా పెంటకోట నరసింగరావు, డైరెక్టర్లుగా పెంటకోట రఘురామ్, కర్రి వెంకునాయుడు నియమితులయ్యారు. వారి కాల పరిమితి వచ్చే ఏడాది జనవరి 30వ తేదీ వరకు లేదా ఎన్నికలు జరిగేంత వరకు ఉంటుందని జీవోలో పేర్కొన్నారు.

మెరక పంటలకు ప్రాణం పోసిన వర్షం



ఆగాకర సాగుకు ప్రాణం పోసిన వర్షం



వర్షం వల్ల కళకళలాడుతున్న కర్రపెండ్లం తోట

గొలుగొండ: తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో శుక్ర, శనివారాల్లో సాయంత్రం కురిసిన భారీ వర్షం మెరక పంటలకు ప్రాణం పోసింది. ఎండిపోతున్న వరి నారుమడులకు ఎంతో మేలు చేసింది. గడిచిన 15 రోజులు నుంచి ఎండల తీవ్రత వల్ల పంటలకు ఎంతో నష్టం కలిగే పరిస్థితి వచ్చింది. నారుమడులు సైతం ఎండిపోయాయి. మెరక భూముల్లో వేసిన ఆగారక, కర్రపెండ్లం, చేదుకాకర, బీర పంటలకు ఎంతో నష్టం వాటిల్లింది. మంచి వర్షాలు కురిసే సమయంలో ఎండల వల్ల ఆయా పంటలు సాగు చేసే రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పంటలు ఎండిపోయే పరిస్థితి రావడంతో ఆందోళన చెందారు. ఈ క్రమంలో శుక్ర, శనివారాల్లో సాయంత్రం భారీ వర్షం కురవడంతో పంటలు ఊపిరి పోసుకున్నాయి. మరో రెండు భారీ వర్షాలు కురిస్తే మండలంలో వరి నాట్లు ప్రారంభమయ్యే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు.

జిల్లాలో పర్యావరణ విధ్వంసం ఆపాలి



జిల్లా జన విజ్ఞాన వేదిక కొత్త కార్యవర్గం

దేవరాపల్లి: జిల్లాలో పర్యావరణ విధ్వంసాన్ని ఆపాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కె.త్రిమూర్తులురెడ్డి, కె.శేషగిరిరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేవరాపల్లిలోని కై రళీ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో ఆదివారం జరిగిన అనకాపల్లి జిల్లా జన విజ్ఞాన వేదిక 18వ మహాసభకు రాష్ట్ర పరిశీలకుల హోదాలో హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సదస్సులో వారు మాట్లాడుతూ జిల్లాలో సైంటిఫిక్ టెంపర్ పెంచడానికి సైన్స్ మేజిక్ షోలు, సైన్స్ ప్రయోగాల ద్వారా పెద్ద ఎత్తున ప్రచారం చేయాలన్నారు. ఈ రెండు అంశాలను సభ ఆమోదిస్తూ తీర్మానం తీసి ప్రభుత్వానికి పంపించనున్నట్లు వారు స్పష్టం చేశారు. అనంతరం జిల్లా జన విజ్ఞాన వేదిక నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా ఎం.కె.దినేష్(దేవరాపల్లి), అధ్యక్షుడిగా ఎం.ఎస్.వి.ఎస్.పి. వర్మ(కశింకోట), ప్రధాన కార్యదర్శిగా కె.వరప్రసాద్(ఎస్.రాయవరం), ఉపాధ్యక్షులుగా బి.వి.ఎస్.వేణు(కె.కోటపాడు), బి.ఎస్.రామ్‌కుమార్(అచ్యుతాపురం), ప్రకాష్(చోడవరం) ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా నాగచంద్ర, వెంకట అప్పారావు, రాంబాబు, కోశాధికారిగా ఉమామహేశ్వరరావుతో ఏడుగురు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.